శరవేగంగా భవన నిర్మాణ పనులు

- రూ. 16 కోట్లతో ఏరియా ఆస్పత్రి అదనపు బిల్డింగ్ నిర్మాణం
- ఇప్పటికే 75శాతం పనులు పూర్తి
- తీరనున్న రోగుల ఇబ్బందులు



ఏరియా ఆస్పత్రి ఆవరణలో నిర్మాణమవుతున్న అదనపు బిల్డింగ్

మిర్యాలగూడ అర్బన్ : డివిజన్ పరిధిలో అతిపెద్ద ఆస్పత్రిగా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి పేరుంది. వాణిజ్య పరంగా అభివృద్ధి చెందుతున్న పట్టణంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా అందుబాటులో ఉన్న వంద పడకల ఆస్పత్రి రోగులకు ఏ మాత్రం సరిపోవడంలేదు. దీంతో అదనంగా మరో వంద పడకలు కలిగిన నూతన బిల్డింగ్ నిర్మిస్తే రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందించడంతో పాటు నల్లగొండకు రిఫర్ చేయాల్సిన కేసులకు సైతం స్థానికంగానే వైద్యం అందించే వీలు కలుగుతుంది. దీంతో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రూ.16కోట్లతో నిర్మాణ పనులు..

నూతన బిల్డింగ్ నిర్మాణం కోసం రూ. 16కోట్లు కేటాయించిన అప్పటి ప్రభుత్వం భవన నిర్మాణానికి వడివడిగా అడుగులు వేసింది. కాలక్రమేనా ప్రభుత్వం మారడం, అప్పటి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన అన్ని పనులను పునసమీక్షించిన ప్రభుత్వం ఏడాదిన్నరగా నిధులు విడుదల కాకపోవడంతో భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని సాక్షి వార్తాకథనాల ద్వారా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురాగా స్పందించిన అధికారులు ఎట్టకేలకు బిల్డింగ్ నిర్మాణ పనులకు నిధులు విడుదల చేశారు. దీంతో పనులు శర వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 75శాతం పైగా పనులు పూర్తి కాగా ఆస్పత్రి ముందు భాగంలో పెంయింటింగ్ పునులు కూడా ప్రారంభమయ్యాయి. అన్ని అనుకూలిస్తే మరో రెండు నెలల్లో నూతన ఆస్పత్రి అదనపు బిల్డింగ్ అందుబాటులోకి రానుందని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. ఏరియా ఆస్పత్రిలో నిర్మాణమవుతున్న అదనపు వంద పడకల నూతన బిల్డింగ్ నిర్మాణ పనులు పూర్తయి అందుబాటులోకి వస్తే స్థానికులకు ఉద్యోగాల కల్పనతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే అందుబాటులోకి



వంద పడకల ఆస్పత్రికి అదనంగా మరో వంద పడకల ఆస్పత్రి భవనం త్వరలోనే అందుబాటులోకి వస్తుంది. ఉన్న వంద పడకల ఆస్పత్రి పరిమితికి మించి రోగులు వస్తున్నారు. పడకలు సరపోకపోవడంతో ఆస్పత్రి వరండాలో సైతం బెడ్లు ఏర్పాటు చేసి రోగులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నాం. నూతన బిల్డింగ్ అందుబాటులోకి వస్తే వైద్యులు, వైద్య సిబ్బంది, శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేసి రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందే అవకాశం ఉంది.

– శ్రీనివాస సమరథ్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

మెరుగైన భూ పరిపాలనకే 'భూ భారతి'

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

డిండి : రాష్ట్రంలో మెరుగైన భూ పరిపాలన అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన భూభారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా 2017 సంవత్సరం కన్న ముందు ఉన్న అసైన్డ్ భూములకు భూ భారతి ద్వారా యజమానికి హక్కు కలిగే విధంగా పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. గతంలో ధరణిలో పెండింగ్ ఉన్న భూ సమస్యలన్ని భూ భారతి చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న 60 రోజుల్లో పరిష్కారమవుతాయన్నారు. భూ రిజిస్ట్రేషన్ ద్వారా తహసీల్దార్ ఇచ్చే పట్టా పాసుపుస్తకంలో ఏమైన అభ్యంతరాలు ఉంటే ఆర్డీఓ, కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, ఏవో రహెనా, ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి



బీసీ గురుకుల విద్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌సీఓ

నాగార్జునసాగర్ : వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ముందస్తుగా ప్రణాళికను తయారు చేసుకోవాలని జ్యోతిబాపూలే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయం సంస్థ జిల్లా సమన్వయ అధికారి(ఆర్‌సీఓ) స్వప్న పేర్కొన్నారు. సోమవారం నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోగల గురుకుల విద్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఉదయం ప్రార్థన సమయానికే పాఠశాలకు వచ్చిన ఆమె సాయంత్రం వరకు జరిగే వివిధ కార్యక్రమాలను పరిశీలించారు. వసతి గృహంలోని రికార్డులను పరిశీలించారు. విద్యాసంవత్సరం ముగుస్తుండటంతో సమగ్ర మూల్యాంకన పరీక్షలు జరుగుతుండటంతో పరీక్ష జవాబు పత్రాలను పరిశీలించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ రాజశేఖర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

చింతపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమమైన విద్య అందుతుందని ఎంఈఓ నీరుడు అంజయ్య అన్నారు. సోమవారం గడియ గౌరారంలో ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు ఆవాస గ్రామాలైన హరిజనాపురం, తుంగపాడు గ్రామంలో ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లల తల్లిదండ్రులను కలిసి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఘడియ గౌరారం పాఠశాలలో గతేడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో 9.7 గ్రేడ్ తో చెట్టిమల్ల అంకిత బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిందని తెలిపారు. అదేవిధంగా రెండేళ్ల నుంచి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిపునకు చందన, మహమూద్, లక్ష్మి ,సాయివర్ధన్ లు ఎంపికయ్యారని తెలిపారు. ఆ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బి వెంకటేశం,కె. కృష్ణారెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు బి.కృష్ణయ్య, వాణి కుమారి, భాగ్యలక్ష్మి, హేమ,శ్రీలత,సుమలత,సువర్ణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మమ్మ, కె.శేషు,శ్రీనివాసులు,జ్యోతి, హైమా తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో 'తన్వికా కలెక్షన్' విడుదల



నూతన ఆభరణాన్ని విడుదల చేస్తున్న స్టోర్ హెడ్ సమీర్

మిర్యాలగూడ : పట్టణంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో తన్వికా అనే కొత్త ఆభరణాన్ని(కలెక్షన్) సోమవారం స్టోర్ హెడ్ సమీర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షయ తృతీయ ఆఫర్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కవిత, హారిక, రజియ, అనంతలక్ష్మి, మమత, మేనేజర్ సంపత్ ఉన్నారు.

క్లుప్తంగా

మంత్రి పొంగులేటికి ఘన స్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బాలునాయక్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

దేవరకొండ : రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంపై చందంపేటలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరయ్యేందుకు వెళ్తూ ఆయన కాసేపు దేవరకొండలో ఆగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులున్నారు.

27న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

చింతపల్లి : మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఈ నెల 27న నిర్వహించనున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అముల్ జమాల్ అస్రా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. 7, 10వ తరగతి ప్రవేశలకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు.చింతపల్లి మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సోమవారం నుంచి వెబ్‌సైట్‌లో హాల్‌టిక్‌ట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని అమ్ముల్ జమాల్ అస్రా తెలిపారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

బహిరంగ వేలం నిర్వహించాలి

కొండమల్లేపల్లి : పశువుల సంతకు బహిరంగ వేలం నిర్వహించాలని కోరుతూ సోమవారం కొండమల్లేపల్లికి చెందిన యాదగిరిగౌడ్ కలెక్టరేట్ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. 2016 నుంచి ఇప్పటి వరకు బహిరంగ వేలం నిర్వహించడం లేదని పేర్కొన్నారు. ఈ సారైన వేలం పాట నిర్వహించాలని కోరారు.

పొలాల వద్ద మోటార్ల వైర్లు భద్రపరుచుకోవాలి

అడవిదేవులపల్లి : రైతులు వ్యవసాయ పొలాల వద్ద ఉన్న విద్యుత్ మోటార్ల వైర్లు సరి చూసుకోవాలని అడవిదేవులపల్లి ఎస్ఐ శేఖర్ కోరారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులు ముగిసిన రైతులు విద్యుత్ వైర్లు, మోటార్లను తీసుకొని వెళ్లి ఇంటి వద్ద భద్ర పరుచుకోవాలని, అలాగే వదిలేస్తే ఒక వైపు మూగ జీవాలు, మరో వైపు మనుషులు విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. రైతులు ఈ విషయాన్ని గుర్తించి అప్రమత్తంగా ఉండాలన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆలయ ప్రవేశం



ఆలయంలో అర్చకుడితో మాట్లాడుతున్న దళితులు, కేవీపీఎస్ నాయకులు

నిడమనూరు : స్థానిక శివాలయంలో కుల వివక్షకు గురి చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో సోమవారం పలువురు దళితులు, కేవీపీఎస్ నాయకులు ఆలయ ప్రవేశం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. పూజలు, అర్చనలప్పుడు కుల వివక్షకు గురిచేస్తున్నారనే ఆరోపణలతో ఆలయ ప్రవేశం చేసి స్థానికుల్లో చైతన్యం తీసుకువచ్చినట్లు కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రెమడాల పరుశురాములు, బొల్లు రవి, కందుకూరి కోటీష్, ఎమ్మార్పీఎస్ నాయకులు బొజ్జ పుల్లయ్య, వింజమూరి ప్రభాకర్, బొజ్జ చిన్నా పలువురు నాయకులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మాడుగులపల్లి : మండల కేంద్రానికి చెందిన పెరుమాళ్ల రవి అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, కాంగ్రెస్ యువ నాయకుడు గడ్డం పురుషోత్తంరెడ్డిలు రవి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. వారి వెంట గ్రామశాఖ అధ్యక్షుడు ఎరుకల వెంకన్న, నరేష్, వెంకటయ్య, జానకి రాములు, నిరంజన్, నరేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్మిక ఉద్యమాల్లో ఐఎన్‌టీయూసీది గొప్ప చరిత్ర

- మాజీ మంత్రి జానారెడ్డి



జానారెడ్డిని సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

త్రిపురారం : కార్మిక ఉద్యమాల్లో దేశంలోనే గొప్ప చరిత్ర కలిగిన సంఘం ఐఎన్‌టీయూసీనేనని మాజీ మంత్రి జానారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అనుముల సుశీల నర్సింహారెడ్డి, ఫంక్షన్ హాలులో సాగర్ నియోజక వర్గ స్థాయి ఐఎన్‌టీయూసీ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జానారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నిరంతరం ఐఎన్‌టీయూసీ కార్మికుల సంఘం నాయకత్వానికి అండగా ఉంటు కోట్లాది మంది సంఘటిత, అసంఘటిత కార్మికుల హక్కుల కోసం పోరాడుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ కార్మిక చట్టాలను రద్దు చేస్తు నాలుగు కోడులుగా విభజించి కార్మికులను బానిస బతుకులుగా మార్చుతుందని ఏద్దేవా చేశారు. కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. కార్మికుల పక్షాన ఐఎన్‌టీయూసీ పోరాటు చేస్తూ అండగా ఉంటుందని, ప్రతి కార్మికుడు ఐఎన్‌టీయూసీ సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రగాని నాగన్న గౌడ్ మాట్లాడుతూ.. గ్రామ గ్రామం నుంచి ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. అన్ని నియోజక వర్గ స్థాయిల్లో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం జానారెడ్డిని, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ను ఐఎన్‌టీయూసీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా మహిళ అధ్యక్షురాలు గోపగాని మాధవి, ముడిమళ్ల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, బిట్టు రవి కుమార్, బహునూతల నరేందర్, మర్ల చంద్రారెడ్డి, అమరేందర్ రెడ్డి, నాగయ్య, అన్వరుద్దిన్, రమేష్, సోమ వెంకన్న, పెరిక వెంకటేశ్వర్లు, రాములు, లక్ష్మయ్య, వెంకన్న పాల్గొన్నారు.

సర్వే డబ్బులు చెల్లించాలని తహసీల్దార్‌కు వినతి

మిర్యాలగూడ టౌన్ : పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల విధులకు, కుటుంబ సమగ్ర సర్వే నిర్వహించిన తమకు డబ్బులు చెల్లించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం మండల తహసీల్దార్ హరిబాబుకు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా కుటుంబ సమగ్ర సర్వే నిర్వహిస్తే ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వాలని ఆ పత్రంలో వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతమ్‌రెడ్డి, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బొందు పార్వతి, ప్రధాన కార్యదర్శి ఇంద్రపల్లి సైదమ్మ, నాయకులు శ్రీదేవి, అప్మా దీబేగం, వరలక్ష్మి, ఎం. అరుణ, మంగమ్మ, స్వరాజ్యం తదితరులున్నారు.

నేటి నుంచి రేషన్‌కార్డులపై ఇంటింటి సర్వే



వార్డు ఆఫీసర్లతో మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో నేటి నుంచి రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి వార్డు ఆఫీసర్లు ఇంటింటి సర్వే చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ సూచించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని ఛాంబర్స్‌లో వార్డు ఆఫీసర్లకు యాప్‌లో ఏ విధంగా నమోదు చేయాలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈఈ వెంకన్న, ఆర్ఓ జ్ఞానేశ్వరీ, టీపీఓ సోమయ్య, టీపీఎస్ అంజయ్య, శానటరి ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ, ఆర్‌ఐలు సాజీ, సాంబయ్య తదితరులలున్నారు.

పోషకాహారంపై అవగాహన అవసరం



మిర్యాలగూడ టౌన్ : యాద్గార్‌పల్లిలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ హేమాదేవి

త్రిపురారం : గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన అవసరమని, ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ సూచించారు. సోమవారం దామరచర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో చెన్నాయిపాలెం సెక్టార్ పరిధిలో మాటూర్-1 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహారాన్ని సకాలంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ వెంకటమ్మ, ఎమ్ఎల్‌హెచ్ చ్‌పీ శ్రవణ్, అంగన్ వాడీ టీచర్లు అరుణ, నీలాబాయి, లక్ష్మీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని యాద్గార్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమాదేవి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన ఆరు నెలలోపు తల్లి పాలను పట్టించాలన్నారు.. ఈ కార్యక్రమంలలో గ్రామ కార్యదర్శి విజయ్, అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, జె. లక్ష్మి, సత్యలక్ష్మి, పాగూర్‌బి, హెల్పర్లు అరుణ, లక్ష్మమ్మ. భద్రమ్మ, ఏఎన్ఎంలు శైలజ, దూవమ్మలతో పాటు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు



పులిచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

పెద్దవూర : ఆరుగాలం శ్రమించి సాగు చేసి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి రైతులు మోసపోవద్దని తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని పులిచర్ల, చలకుర్తి, చింతపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఇంటి వద్దనే ధాన్యాన్ని ఆరబెట్టుకుని సరైన తేమశాతం వచ్చాకనే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం లలిత, ఆర్‌ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటయ్య, మార్కెట్ డైరెక్టర్ లక్ష్మణ్, మాజీ ఉప సర్పంచ్ చాపల వెంకటేశ్వర్‌రెడ్డి, వీఓఏలు వీరబోయిన పద్మ, సురేందర్, కళమ్మ పాల్గొన్నారు.

ఉద్యానవనం ఎదుట కంపచెట్లు తొలగింపు



ఉద్యాన వనం ఎదుట కంపచెట్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది



కంపచెట్లు తొలగించిన అనంతరం

సాక్షి ఎఫెక్ట్..

కొండమల్లేపల్లి : పట్టణ కేంద్రంలోని స్థానిక సాగర్ రోడ్డులో జేబీ కాలనీలో రూ.40 లక్షలతో నిర్మించిన ఉద్యానవనం ముందు ప్రవేశద్వారం మొత్తం కూడా కంపచెట్లతో ఉంది. ఈ అంశాన్ని సాక్షి దినపత్రికలో ఉద్యానవనంలోకి పోయేదెలా అనే శీర్షికన సోమవారం వార్తా కథనాన్ని ప్రచురించింది. ఈ మేరకు స్పందించిన స్థానిక గ్రామపంచాయతీ ఈఓ డాకు నాయక్ గ్రామపంచాయతీ సిబ్బందితో ఉద్యానవనం ఎదుట మొత్తం చెట్లను తొలగించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పూలే సినిమాను విడుదల చేయాలి

మాడుగులపల్లి : వాస్తవ చరిత్ర ఆధారంగా తీసిన పూలే సినిమాను విడుదల చేయకుండా ఆపడం మూర్ఖత్వమని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ కాలం మారింది కాని మనువాద బ్రాహ్మణ భావజాలం ఇంకా ఏమాత్రం మారలేదన్నారు. జరిగిన చరిత్రను సినిమాగా చూపిస్తే తప్పు పడుతున్నారన్నారు. సినిమా డైరెక్టర్‌ను, అతడి కుటుంబ సభ్యులపై వ్యక్తిగతంగా అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఈ సినిమా ద్వారా బహుజన సమాజానికి కొంచెమైనా చైతన్యం వస్తుందన్నారు.

శోభన్‌బాబుకు సేవా, ప్రతిభారత్న అవార్డులు

హాలియా : అనుముల మండలంలోని పేరూర్ గ్రామానికి చెందిన కొండూరు శోభన్‌బాబుకు సేవారత్న, ప్రతిభారత్న అవార్డులు దక్కాయి. హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీసు సామాజిక సేవ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో అవార్డులు అందజేశారు. ఆ సంఘం ప్రెసిడెంట్ సత్యనారాయణ, రిటైర్డ్ జడ్జి శ్రీనివాస గుప్తా, సుప్రీంకోర్టు న్యాయవాది మల్యాద్రి ఈ అవార్డులు అందజేసినట్లు తెలిపారు. పలు సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టినందు కుగాను తనకు ఈ అవార్డులు ప్రదానం చేసినట్లు తెలిపారు. అవార్డులు రావడం పై ఆర్యవైశ్య సంఘం నాయకులు, పేరూర్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మిర్యాలగూడ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్‌కు దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకన్న సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాస్ లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యాన్ని నివారించాలని, ఎస్సీ ఇండస్ట్రీస్ 2018– 22 ఉన్న సబ్సిడీలనును తక్షణమే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. దళితులపై దాడులు చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లింగనాయక్, జిల్లా యాదగిరి, సైదులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

హాలియా : మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీ తిరుపతయ్య సోమవారం తెలిపారు. మున్సిపాలిటీలోని ఏడో వార్డులో కొత్తగా విద్యుత్ స్తంభాలు లేక లేక వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి చొరవతో వార్డులో 50 విద్యుత్‌స్తంభాలను ఏర్పాటు చేశామన్నారు. దీంతో ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తవన్నారు. హాలియా మున్సిపాలిటీలో, అనుముల మండలంలో నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి



మిర్యాలగూడ అర్బన్ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : కార్మికుల హక్కుల సాధన కోసం కార్మికులు ఐక్య ఉద్యమాలకు సిద్ధంకావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పట్టణంలోని సాగర్‌రోడ్డులో లైట్ మోటార్స్ వెహికిల్ కార్మికులతో కలిసి మేడే పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. . ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ధీరావత్ లింగానాయక్, వెంకన్న, జానయ్య, షఫి, శ్రీనివాస రాజు, సురేష్, శ్రీను, రఫి పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలు విజయవంతం చేయాలి

చింతపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో మే 1న నిర్వహించే మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జినియాదగిరిరావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కౌన్సిల్ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జుని అంజన్ రావు, శంషాద్దీన్, లక్ష్మయ్య, పరశురాములు, ఎల్లయ్య, రాములు పాల్గొన్నారు.

కాల్వ నీరు వృథా కాకుండా చూడాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కంపాసాగర్ గ్రామస్తులు

త్రిపురారం : మండలంలోని కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సాగర్ ఎడమ కాలువలో నీరు వృథా కాకుండా చూడాలని సోమవారం తహసీల్దార్ గాజుల ప్రమీలాకు తన కార్యాలయంలో గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. కంపాసాగర్ ఎడమ కాలువ పరిధిలో నిలిచి ఉండే నీటిని పెద్దదేవుల పల్లి గ్రామస్తులు చేపలు పట్టడానికి వృథా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి కాలంలో ప్రజల అవసరాలకు ఉపయోగపడే నీటిని అకారణంగా ఎస్కేప్ తలుపుల ద్వారా కిందకు వదలకుండా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కార్యక్రమంలో కొండా భాస్కర్, అవిరెండ్ల రవి, శ్రీను, లక్ష్మయ్య, సతీష్, సోమయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేసేదెవరు?

- మున్సిపాలిటీలో పనిచేయని చేతిపంపులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- వినియోగంలోకి తేవాలని కోరుతున్న పట్టణవాసులు



ఎస్ఎస్‌పీ క్యాంపులో నిరుపయోగంగా ఉన్న చేతి పంపు

మిర్యాలగూడ టౌన్ : ప్రజల దాహర్తిని తీర్చడంలో చేతి పంపుల పాత్ర ఎంతో కీలకం. తాగునీటి పథకాలు పని చేయనప్పుడే కాదు..మిషన్ భగీరథ నీళ్లు రానప్పుడు ఇవే ఆధారమవుతున్నాయి. చేతిపంపులపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టిని సారించలేకపోతున్నారు. దీంతో ఆ చేతి పంపులన్నీ నిరుపయోగంగానే దర్శనిమివ్వగా.. కొన్ని మరమ్మతులకు నోచుకోగా.. కొన్ని నీరున్నా నిరుపయోగంగా మారాయి.

70కి పైగా చేతిపంపులు మరమ్మతులకు

మిర్యాలగూడ మున్సిపాలిటీలో 48 వార్డులుండగా వీటి పరిధిలో సుమారు 500కిగా చేతి పంపులు ఉండగా వీటిలో సుమారు 70కిపైగా చేతి పంపులు సరిగా పని చేయడం లేదు. పలు వార్డుల్లో చేతి పంపులు ఉన్నప్పటికీ వాటిని మరమ్మతులకు నోచుకోక మరి కొన్ని ప్రాంతాల్లో చేతిపంపులు పూడిపోయాయి. మరి కొన్ని ప్రాంతాల్లో చైన్‌లు లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవడంలో మున్సిపల్ అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ఆయా వార్డుల ప్రజలు ఆరోపిస్తున్నారు. కాగా కాలనీల్లోని శివారు ప్రాంతాలకు మంచినీటి నల్లాలు లేకపోవడంతో చేతి పంపునీళ్లు ఆధారమవుతున్నాయి.

వినియోగంలోకి తెస్తాం



మున్సిపాలిటీలో పని చేయని చేతి పంపులను గుర్తించి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం. ఈ విషయాన్ని నీటి విభాగం సిబ్బందికి తెలియజేసి పనిచేయని చేతిపంపులు గుర్తించే విధంగా చూస్తాం. ప్రస్తుతం పట్టణానికి సరిపడ నీటిని సరఫరా చేస్తున్నాం. పట్టణంలోని నీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలను చేపడుతున్నాం.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ